క్లుప్తంగా

చంద్రారెడ్డి మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

డిండి: మండలంలోని వావిల్‌కోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పేర్వాల చంద్రారెడ్డి మృతి చెందడం బాధాకరమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం వావిల్‌కోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన చంద్రారెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జంగారెడ్డి, యాదగిరిరావు, దామోదర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రామచంద్రగూడం సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ వర్క్స్‌లో భాగంగా ఆదివారం రామచంద్రగూడెం ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్, బైపాస్ ఫీడర్, యాద్గార్‌పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బంది, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గాదరి కిశోర్ వ్యాఖ్యలు సమంజసం కావు

కొండమల్లేపల్లి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాదరి కిశోర్ తన భాషను మార్చుకోవాలని హితవు పలికారు.

వాడపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్ బాబును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి పంచాయతీకి మంజూరైన నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు, రికార్డులను సమర్పించలేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా మరొకరికి బాధ్యతలు అప్పగించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

28న క్రీడా జట్ల ఎంపిక

మిర్యాలగూడ టౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్–14, అండర్–17 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 28న మిర్యాలగూడలోని క్రియో ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి డి.విమల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభం అవుతాయన్నారు.ఆసక్తి గల క్రీడాకారులు బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని కోరారు. వివరాల కోసం సెల్‌నంబర్లు 99480 52108, 91823 68863 సంప్రదించాలని పేర్కొన్నారు.

మొక్కలతోనే మనుగడ



ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ సతీశ్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న ప్రిన్సిపాల్ కోటిరెడ్డి

హాలియా : ప్రజలు, జీవకోటి మనుగడ కోసం మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలని హాలియా ఎస్‌ఐ సతీశ్‌రెడ్డి అన్నారు. శనివారం హాలియా పట్టణంలోని టైం స్కూల్‌లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పట్టణంలో ర్యాలీలో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కత్తి కోటిరెడ్డి, డైరెక్టర్ మంద నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దాతల చేయూత అభినందనీయం

హాలియా : ప్రభుత్వ పాఠశాలలకు దాతల చేయూతనందించడం అభినందనీయమని యాచారం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సిరిగిరి నాగిరెడ్డి అన్నారు. యాచారం పాఠశాల్లో చదువుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కుందూరు వెంకట్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు రూ.25 వేల విలువగల స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సీఐ కుందూరు వెంకట్‌రెడ్డి తోడ్పాటునందించడం హర్షనీయమన్నారు. సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, పీడీ నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ హాళ్లు

- రూ.3కోట్లు వెచ్చించి నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ భవనాలు
- స్వాధీనం చేసుకోని మున్సిపల్ అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా బిల్డింగ్‌లు





ఎన్‌ఎస్‌పీ క్యాంపులో నిర్మించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ భవనాలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కమ్యూనిటీ భవనాలు నేడు నిరుపయోగంగా మారాయి. 2019 జూలై 12న టీయూఎఫ్ఐడీసీ పథకం కింద చేపట్టిన సంత్ సేవాలాల్ భవనం (ఎస్టీ), మహాత్మా జ్యోతిరావు పూలే భవనం (బీసీ), డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనం (ఎస్సీ) సముదాయాలకు అప్పటి రాష్ట్ర మంత్రి జగదీష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర క్రితమే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే ఈ భవనాలకు ప్రధానంగా ప్రహరీ నిర్మాణం, చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉండడంతోపాటు బిల్లులు కూడా పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో ఇప్పటి వరకు కాంట్రాక్టర్ నుంచి మున్సిపల్ శాఖ స్వాధీనం చేసుకోలేదు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ భవనాలు రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు, పంచాయితీలకు అడ్డాగా మారాయి.

ప్రతి భవనానికి రూ.కోటి వ్యయం

పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో ప్రతిషాత్మకంగా నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ భవనాలకు టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద ఒక్కో భవనానికి కోటి రూపాయల చొప్పున కేటాయించారు. ఈ భవనాలను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాన్ని పంచాయితీరాజ్ శాఖ నిర్మించగా సంత్ సేవాలాల్ భవనం, మహాత్మా జ్యోతిరావ్‌పూలే భవనాలను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు పూర్తి చేశారు. కానీ మిగిలిన పనులను పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో ఈ భవనాలు నిరుపయోగంగా మారాయి. సేవాలాల్ భవనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ప్రస్తుతం ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయానికి పాఠకులు పెరగడంతో రూ.మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ మూడు సముదాయాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు కోరుతున్నారు.

రక్తదానం అభినందనీయం



శిబిరంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్ : అత్యవసర పరిస్థితిల్లో రక్తం అందక చాలా మంది ఇబ్బందులు పడుతుంటారని పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం, రక్తం ఇచ్చేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. పోలీస్ అమరవీరుల వార్సోతవాల్లో భాగంగా శనివారం మిర్యాలగూడ సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన పోలీసులు, ఔత్సాహికులను అభినందించారు. రకతదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి ప్రతి రక్తదానం చేయాలని సూచించారు. కాగా ఈ రక్తదాన శిబిరంలో 106 యునిట్ల బ్లడ్‌ను రెడ్‌క్రాస్‌కు అందజేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.రాజశేఖరరాజు, సీఐలు వీరబాబు, జనాన్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పోలీస్ అధికారులు

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలి

- ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

వేములపల్లి(మాడ్గులపల్లి) : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఎం మండల 3వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలను అనుసరిస్తూ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి ప్రజలపై మోయలేని ధరల భారాలను మోపుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం మాడ్గులపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, గడగోజు వెంకటాచారి, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, తంగెళ్ల నాగమణి, ఎర్ర కన్నయ్య, పతాని శ్రీను, బొమ్మకంటి అంజయ్య, శ్రీను, వెంకటయ్య, విష్ణు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిపై ఆరోపణలు నిరాధారం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత శ్రీనివాస్

మిర్యాలగూడ : డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌పై కొందరు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన దామరచర్ల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ ప్రభుత్వ హయాంలోనే బీఆర్ఎస్ నాయకులు అటవీ, ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఆరోపించారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న శంకర్‌నాయక్‌పై, ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో పగిడి జీడయ్యయాదవ్, కందుల నరసింహారెడ్డి, కొమ్ము దాసు, సందాల శంభయ్య, సయ్యద్‌ఖాదర్ ఎస్‌కె.గాలిబ్, గాలి రవీందర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఏటీడీఓ ఎం. శ్రీనివాస్

పెద్దవూర : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి(ఏటీడీఓ) ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం పెద్దవూరలోని సమీకృత బాలికల వసతిగృహం, చలకుర్తి గిరిజన హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, హాస్టల్ సిబ్బందికి సంబంధించిన హాజరు పట్టికలు, రికార్డులు, వంటగది, భోజనాలు, మూత్రశాలలు, పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. వార్డెన్లు స్థానికంగా ఉండాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యూటర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రభలకుండా వంటగది, హాస్టల్ పరిసరాల్లో బ్లీచింగ్ ఫౌడర్ చల్లాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. ఆయన వెంట వార్డెన్లు అహల్యారెడ్డి, సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

బీసీలకు అన్ని రంగాల్లో వాటా దక్కాలి



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీలకు వాటా దక్కాలని, బీసీలకు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, కో కన్వీనర్ కోల సైదులు, కాంగ్రెస్ నేత, బీసీ జేఏసీ నాయకులు తమ్మడబోయిన అర్జున్ అన్నారు. శనివారం మిర్యాలగూడ ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మహాత్మాజ్యోతి రావుపూలే బీసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలను చైతన్యం చేసేందుకే నవంబర్ 3వ తేదీన మిర్యాలగూడలో బీసీ గర్జన బహిరంగ సభను ఏర్పాటు చేశామన్నారు. చట్టసభల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. రాజ్యాధికారం వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. నవంబరు 3న జరిగే విజయవంతం చేసేందుకు బీసీ ఉద్యోగులు, యువకులు, మహిళలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పూలే భవనం వద్ద ప్రచార రథాన్ని ప్రారంభించారు. సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు పిన్నబోయిన శ్రీనివాస్, జయరాజు, శిరసనగండ్ల ఈశ్వరాచారి, తిరుమలగిరి అశోక్, మహేష్, సింగు రాంబాబు, సింగ్ కృష్ణ, పున్నా రాములు తదితరులున్నారు.

బీసీ గర్జనను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో నవంబర్ 3వ తేదిన జరిగే బీసీ గర్జనను విజయవంతం చేయాలని బీసీ న్యాయవాదులు కోరారు. శనివారం స్థానిక మిర్యాలగూడ బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన బీసీ న్యాయవాదుల సమావేశంలో పలువురు మాట్లాడారు. బీసీల హక్కుల కోసం రాజీలేని పోరాటాల ను నిర్వహించేందుకు బీసీలంతా ఒకే వేదికపైకి రావాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 29వ జీఓతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో బీసీ న్యాయవాదులు నేతి సత్యనారాయణ, లింగంపల్లి శ్రీనివాస్, బహునూతల వేణుగోపాల్ రావు, సాయికుమార్ యాదవ్, కె. శ్రీనివాస్, ఆంజనేయులు, దేవులపల్లి శ్రీనివాసాచారి, ఉమాశంకర్, భాస్కర్‌నాయుడు, పరమేష్, వినోద్, మల్లేష్, మహేష్, ప్రసాద్, ఎస్‌వీ నాయకుడు, సైదులు తదితరులున్నారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ప్రతి నెల 30వ తేదీన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని కోరుతూ కులవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరశురాములు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో దళితులపై జరుగుతున్న వివక్షతను రూపుమాపాల్సిన బాధ్యత తహసీల్దార్లపై ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో దళితులకు ఇళ్ల కూడా అద్దెకు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోడిరెక్క మల్లయ్య, దైద దేవయ్య, బొంగరాల వెంకటయ్య, పాపారావు, జనార్దన్, అచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐబీఎస్ఎస్ మండల అధ్యక్షుడిగా సీతారాంనాయక్



పెద్దవూర: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) మండల అధ్యక్షుడిగా మండలంలోని పూల్యాతండాకు చెందిన రమావత్ సీతారాం నాయక్ నియామకం అయ్యారు. నందికొండలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావునాయక్, ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్‌నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 27వ తేదీన జరిగే సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యాదవ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి చెగొండి మురళియాదవ్ కోరారు. సమ్మేళనం పోసర్‌ను శనివారం మిర్యాలగూడలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో చింతలచెరువు లింగయ్య, గుండెబోయిన నాగేశ్వర్‌రావు, ఉరిబండి శ్రీనివాస్ యాదవ్, ప్రసన్నయాదవ్, పబ్బతి కోటయ్య శ్రీకాంత్, వెంకన్న ఉన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడు విజయ్‌కుమార్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట శ్రీనివాస్, తాటికొండ విక్రంగౌడ్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న లింగంగౌడ్

స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్న ప్రజలు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు



సీతారాంపురంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో ప్రజలు బీజేపీ సభ్యత్వాన్ని తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మిర్యాలగూడలోని 48వ వార్డు సీతారాంపురంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అందించేందుకు పార్టీ కార్యకర్తలు శక్తివంచన లేకుండా పని చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి నేడు ఆ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. పార్టీ కార్యకర్తలు సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బంటు సైదులు, బంటు గిరి, వేణు, గిరి తదితరులున్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

పెద్దవూర : మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ వద్ద శ్రీధర శివరామ దీక్షిత అచల సిద్ధాంత అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జోరిగల బుచ్చిరామదాసాచార్యుల ఆరాధనోత్సవాలు శనివారం ముగిశాయి. శివరామ దీక్షిత అచల గురు మందిరంలో రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన గురువులు, పీఠాధిపతులు భక్తులకు ప్రవచనాలు బోధించారు. పెద్దవూర మండల కేంద్రంలో బుచ్చిరామదాసాచార్యుల చిత్రపటాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

త్రిపురారం: నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్య గూడెం సమీపంలో శనివారం రాత్రి ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలంలోని ముకుందాపురం నుంచి తుమ్మడం వెళ్తున్న ఆటో ముదిమాణిక్యం కాలువ వెంట ఉన్న మూలమలుపు వద్ద బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న పాపయ్య(60)కు తీవ్రంగా గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో 108 వాహనంలో మిర్యాలగూడకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారి ఐలయ్య

త్రిపురారం : ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య కోరారు. శనివారం త్రిపురారంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలు తీసుకురావాలని చూస్తుందని, జమిలీ ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నేతలక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి దైద శ్రీను, చందనబోయిన అంజయ్య, చందనబోయిన లక్ష్మయ్య, కొప్పు వెంకన్న, చందనబోయిన రామచంద్రు, వల్లపు వెంకటయ్య, ఎస్‌కే జానీ, అన్నపాల వెంకన్న పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కొండమల్లేపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.వెంకటేష్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొండమల్లేపల్లిలో శుక్రవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, రాకేష్, చరణ్, శరత్, ఆంజనేయులు, ఇద్దిరాములు, సరస్వతి, మౌనిక, ఆరాధ్య, జ్యోతి, హారిక, అంజలి పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పశువుల వివరాలను అందించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : 21వ అఖిల భారత పశుగణన సందర్భంగా పాడి రైతులు తమ పశువుల వివరాలను అధికారులకు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశుగణన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో పశువుల డేటా సేకరించి లైవ్ స్టాక్ సెన్సెస్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ శంకర్‌రావు, /జ్ఞానేశ్వర్‌ప్రసాద్, దుర్గా రమాదేవి, సందీప్, స్వప్న, మేగ్యానాయక్, జానిపాషా, శ్రీకాంత్, ఆస్మా, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలి

గుర్రంపోడు : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు కోదాటి మధుసూదన్, భూతం సైదులు, తేనపల్లి హెచ్‌ఎం వహీదుద్దీన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రాగిణి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

వైద్యం వికటించి బాలుడు మృతి

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం తెల్లవారుజామున వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందినట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గుడితండాకు చెందిన 7 సంవత్సరాల బాలుడికి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. రాత్రి చికిత్స అందించిన వైద్యులు శనివారం తెల్లవారుజామున బాలుడు మృతిచెందినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీయడంతో గుట్టుచప్పుడు కాకుండా బాలుడి కుటుంబానికి కొన్ని డబ్బులు అప్పజెప్పి చేతులు దులుపుకున్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ అడగగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

బాల్నేపల్లిలో పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

అడవిదేవులపల్లి : మండలంలోని బాల్నేపల్లి గ్రామంలో శనివారం పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాళోతు మేగ్యానాయక్ మాట్లాడుతూ గ్రామంలో 250 పశులకు టీకాలు వేశామని, చూడి పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య అసిస్టెంట్ అధికారి నాగరాజు, గోపాలమిత్ర దేవ్‌సింగ్, ఐలమ్మ, సిపాయి తదితరులున్నారు.